ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 26 డిసెంబరు 2024

వాజ్‌పేయి విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



ఆదర్శప్రాయుడు వాజ్‌పేయీ

● విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కడప మారుతీనగర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దివం గత అటల్‌బిహారీ వాజ్‌పేయీ సాత్విక రాజకీయాలు నడిపిన గొప్ప ఆదర్శ ప్రాయుడని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కొనియాడారు. వాజ్‌పేయీ వందేళ్ల జయంతిని పురస్కరించుకుని కడప నగరం ఎన్జీవో కాలనీలోని మోర్ మార్కెట్‌కు ఎదురు వీధిలో బీజేవైఎం రాష్ట్ర నేత పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వాజ్‌పేయి విగ్రహావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశాన్ని కమ్యూని కేషన్, రవాణారంగాల్లో వాజ్‌పేయీ అగ్రపథాన నడిపించారన్నారు. అలాంటి మహనీయుడి ఆలోచనా విధానాలను కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాలక్రిష్ణ యాదవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, బొమ్మన సుబ్బరాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా క్రిస్మస్ సంబరాలు



సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

కడప కల్చరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా క్రిస్మస్ సం బరాలు విశ్వాసులు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని అన్ని చర్చిల్లో బు ధవారం అర్ధరాత్రి నుంచి విశ్వాసులు పెద్ద ఎత్తున చేరుకుని ప్రత్యేక ప్రార్థ నలు నిర్వహించారు. ఆ కోవలో కడప నగరంలోని సీఎస్ఐ చర్చి, ఆరోగ్య మాత పుణ్యక్షేత్రం, మరియాపురం చర్చి, పాత రిమ్స్ వద్ద గల టౌన్ చర్చి, మాసాపేట చర్చి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున దైవ ప్రార్థనలు నిర్వ హించారు. క్రీస్తు జననం లోకానికి గొప్ప వరమని మరియాపురం కథోలిక మేత్రాసన గురువు గాలిబాలి కొనియాడారు. మానవ జీవితం దేవుడిచ్చిన వరమని, నీ వలే పొరుగు వారిని కూడా ప్రేమతో చూడాలని కోరారు.

రాజకీయ మలుపు



ఎన్నికల్లో అంతా అవాక్కయ్యేలా ఓటర్లు తీర్పునిచ్చారు. మాజీ సీఎం జగన్ సొంత జిల్లాలోనే ఓటర్లు వైసీపీకి పాతరేశారు. మంచి పరిపాలన అందిస్తారని జనం వైసీపీకి ఓట్లు వేసి కట్టబెడితే.. పాలన గాలికొదిలేసి కబ్జాలు, సెటిల్‌మెంట్లు, పన్నుల పెంపుతో జనం నడ్డి విరగ్గొట్టారు. దీంతో విసిగిపోయి జనం ఫ్యాను రెక్కలు పీకి పడేశారు. కూటమికి పట్టంగట్టారు. 2024 ఎన్నికలు రాష్ట్ర రాజకీయాలపై చెరగని ముద్రవేశాయి. జిల్లా రాజకీయాలను కొత్త మలుపు తిప్పాయి. ఈ ఎన్నికల్లో తొలిసారిగా ముగ్గురు ఎమ్మెల్యేలు అసెంబ్లీ మెట్లెక్కారు. ఆ ముగ్గురూ టీడీపీ వారే కావడం విశేషం.

● వైసీపీకి మిగిలింది ఇద్దరే..



రౌండప్ 2024

(కడప-ఆంధ్రజ్యోతి): కడప దశాబ్దాలుగా వైఎస్ కుటుంబానికి అండగా ఉంటూ వస్తోంది. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయ్యారు. 2004, 2009 ఎన్నికల్లో జనం ఉమ్మడి జిల్లాలో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్‌కు కట్టబెట్టారు. జగన్ 2011లో పార్టీ స్థాపించిన తరువాత జరిగిన ఉప ఎన్నికలు, 2014 ఎన్నికలు, 2019 ఎన్నికల్లో వైసీపీ దాదాపు క్లీన్‌స్వీప్ చేసింది. మనోడే సీఎం అయితే జిల్లా అభివృద్ధి చెందుతుందని అందరూ ఆశించారు. అయితే జనం ఆశించిన రీతిలో జగన్ పాలన సాగలేదు. 30 ఏళ్లు తామే అధికారంలో ఉంటామన్న ధీమాతో అభివృద్ధి మరిచి బటన్ నొక్కడమే పనిగా పెట్టుకున్నారు. సంక్షేమ జపం చేస్తూ తప్పక జనం ఓట్లువేస్తారనే నమ్మకంతో కాలం గడిపారు. ఇక భూకబ్జాలు, ఇసుక, మట్టి దందా, ప్రశ్నిస్తే దాడులతో ఐదేళ్లు ఒక విధమై న భయంకర వాతావరణం ఉండేది. అవకాశం కోసం చూసిన జనం 2024 ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు విరిచి పడేశారు. కడప పార్లమెంటులో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉంటే పులివెందుల నుంచి జగన్, బద్వేలు నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాత్రమే గెలిచారు. ఇక పార్లమెంటు ఎన్నికల్లో కూడా చావు తప్పి కన్ను లొట్టబోయినట్లుగా తక్కువ మెజార్టీతో అవినాశ్‌రెడ్డి బయటపడ్డారు. ఆ తరువాత ఈ ఆరు నెలల్లో వైసీపీ పరిస్థితి ఆశాజనకంగా లేదు. కడప కార్పొరేషన్ నుంచి 8 మంది కార్పొరేటర్లు సైకిలెక్కేశారు. ప్రొద్దుటూరులో పలువురు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. కార్పొరేటర్లతో వైఎస్ జగనే సమావేశమై వారిని బుజ్జగించాల్సిన పరిస్థితి వచ్చింది. అయినా ఎంతమంది ఉంటారో, ఎంతమంది సైకిలెక్కుతారో తెలియని పరిస్థితి నెలకొంది.

2024లో ఎన్నెన్నో

2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడి తొలిసారిగా పోటీ చేశారు. కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల నుంచి టీడీపీ పోటీ చేయగా, జమ్మలమడుగు, బద్వేలు నుంచి బీజేపీ అభ్యర్థులు పోటీ చేశారు. జమ్మలమడుగులో బీజేపీ నుంచి మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి గెలుపొందగా, కడప నుంచి ఆర్.మాధవి, కమలాపురం నుంచి పుత్తాక్రిష్ణచైతన్యరెడ్డి, మైదుకూరు నుంచి పుట్టసుధాకర్‌యాదవ్, ప్రొద్దుటూరు నుంచి ఎస్.వరదరాజులరెడ్డి టీడీపీ తరఫున గెలిచారు.

వైఎస్ కుటుంబానికి మరో ఓటమి

జిల్లా రాజకీయాల్లో వైఎస్ కుటుంబానికి చెరగని ముద్ర ఉంది. అయితే ఆ కుటుంబం నుంచి ఎన్నికల్లో ముగ్గురు ఓటమిపాలయ్యారు. 2014 ఎన్నికల్లో జగన్ తల్లి వైఎస్ విజయలక్ష్మి వైజాగ్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇక 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి దివంగత మాజీ మంత్రి వైఎస్ వివేకా ఓటమి చెందగా, 2016లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీటెక్ రవి చేతిలో వివేకా ఓటమి చెందారు. ఇక 2024 ఎన్నికల్లో జగన్ చెల్లి వైఎస్ షర్మిల కాంగ్రెస్ నుంచి కడప ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

వివేకా హత్య చుట్టూ..

మాజీ మంత్రి వివేకానందరెడ్డి 2019 మార్చి 15న పులివెందులలోని తన ఇంట్లోనే హత్యకు గురయ్యారు. అయితే ఆ కేసు హాలీవుడ్ సినిమాను తలపించే విధంగా ఎన్నో మలుపులు తిరిగింది. చివరికి సీబీఐ కడప ఎంపీ అవినాశ్, ఆయన తండ్రితో సహా పలువురిపై అభియోగాలు మోపింది. కొందరు జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. అయితే ఈ ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల వివేకా హత్యను ప్రచారంలో ప్రధానాస్త్రంగా వాడుకున్నారు. ఇక టీడీపీ కూడా హూకిల్డ్ బాబాయ్ అంటూ ప్రచారంలో మారుమోగించింది.

తొలిసారిగా ముగ్గురు అసెంబ్లీకి

2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. అయితే ప్రజలు ఈసారి ఆ సంప్రదాయానికి తెరదించారు. కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పట్టారు. కడప నుంచి ఆర్.మాధవి, కమలాపురం నుంచి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తొలిసారిగా పోటీ చేసి గెలుపొందారు. ఇక మైదుకూరులో పుట్టా సుధాకర్‌యాదవ్ తొలిసారిగా గెలిచారు. ఈ ముగ్గురూ అసెంబ్లీలో మొదటిసారి అడుగుపెట్టారు.

కూటమికి గుడ్‌ఇయర్

కూటమికి 2024 గుడ్ ఇయర్. టీడీపీ, జనసేన, బీజేపీ ఓట్లు ఆయా అభ్యర్థులకు పరస్పరం బదిలీ అయ్యాయి. కేడరు కూడా బాగా కలిసి పనిచేసింది. జనం కూడా కూటమిపై నమ్మకం పెట్టుకుని పట్టం గట్టారు. ఉమ్మడి జిల్లాలోని రైల్వేకోడూరులో జనసేన నుంచి అరవ శ్రీధర్, రాయచోటిలో టీడీపీ నుంచి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గెలుపొందారు. సొంతజిల్లాలో తిరుగులేదని భావించిన జగన్ అండ్ కో కేవలం పులివెందుల, బద్వేలుతో సరిపెట్టుకోవలసి వచ్చింది. ఇక వైఎస్ కూతురుగా కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి కడప పార్లమెంటుకు పోటీ చేసిన షర్మిలాకు తొలి ప్రయత్నంలో చేదు అనుభవం ఎదురైంది. ఓ విధంగా చెప్పాలంటే వైఎస్ కుటుంబానికి 2024 బ్యాడ్ ఇయర్.. కూటమికి గుడ్ ఇయర్. మొత్తానికి 2024 తొలి ఆరునెలలు వైసీపీ పాలన సాగగా మిగతా ఆరు నెలలు కూటమి పాలన సాగుతోంది. జిల్లా రాజకీయాలపై ఈ సంవత్సరం చెరగని ముద్రవేసింది.

- 2024 జగన్ అండ్ కోకు బ్యాడ్ ఇయర్
- ఇష్టారాజ్యపాలనకు సొంత జిల్లాలోనే చెక్
- ఐదు చోట్ల కూటమి దుందుభి
- పులివెందుల, బద్వేలుకే వైసీపీ పరిమితం
- తొలిసారి ముగ్గురు అసెంబ్లీకి
- ఈ ఏడాది రెండు ప్రభుత్వాల పాలన
- తొలి ఆరు నెలలు వైసీపీ..
- మరో ఆరు నెలలు కూటమి ప్రభుత్వం

వైభవంగా గోవిందుడి నిశ్చితార్థ వేడుక



గోవిందుడి నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): గోవిందమాల భక్తబృంద సేవా సమి తి ఆధ్వర్యంలో శ్రీవారి భక్తుల సహకారంతో చేపడుతున్న కల్యాణోత్సవాలు బుధవారం స్థానిక మున్సిపల్ స్టేడియంలో మొదలయ్యా యి. నెల్లూరు జిల్లా అల్లూరుకు చెందిన వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ వేకువజా మున స్వామివారు కొలువు తీరారు. అనంత రం గోవిందమాల భక్తులు గోపూజ నిర్వహిం చారు. భక్తులు సామూహిక విష్ణు సహస్రనా మస్తోత్ర పారాయణం చేశారు. కల్యాణోత్సవం లో భాగంగా నిర్వహించిన గోవిందుడి నిశ్చితా ర్థం వైభవంగా జరిగింది. మాలధారులే కాకుం డా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన శ్రీ వారి భక్తులతో మున్సిపల్ మైదానం కోలాహ లంగా కనిపించింది. శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం గురువారం ఉదయం 9గంటలకు ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో గోవిందుడు

మళ్లీ మంచిరోజులు వస్తాయ్

● ఎవ్వరూ అధైర్యపడొద్దు ● మాజీ సీఎం వైఎస్ జగన్

● పులివెందుల సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు

పులివెందుల/లింగాల, డిసెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): ఎవ్వరూ అధైర్యపడవద్దని మళ్లీ మంచిరోజులు వస్తాయని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పులివెందుల సీఎస్ఐ చర్చిలో కుటుంబ సభ్యులతో కలసి క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్నా రు. ఇక్కడే క్రిస్మస్ కేక్ కట్ చేశారు. క్యాలెం డర్ ఆవిష్కరించారు. అనంతరం లింగా ల మండలంలోని తాతిరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. మూడు రోజులుగా తాతిరెడ్డిపల్లెలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సాగుతోంది. చివ ర రోజైన బుధవారం జగన్ ఈ వేడుకల్లో పా ల్గొన్నారు. స్వామివార్లకు పట్టువస్త్రాలు సమ ర్పించారు. కాగా.. పులివెందుల నుంచి లింగా లకు బయలుదేరిన జగన్‌కు ఊరూరా ప్రజలు ఘనస్వాగతం పలికారు. భారీగా తరలివచ్చి న జనానికి ఆయన అభివాదం చేస్తూ పలకరి స్తూ ముందుకు సాగారు. పలుచోట్ల జగన్‌కు పలువురు ప్రజలు వారి వ్యక్తిగత సమస్యలను అర్జీల రూపంలో సమర్పించారు. ఆయన స్పం దిస్తూ మీ సమస్యల పరిష్కారానికి ఎంపీ చొరవ చూపుతారన్నారు. ఎవరూ అధైర్యపడా ల్సిన అవసరం లేదని మళ్లీ మంచిరోజులు వస్తాయన్నారు. 4గంటల ప్రాంతంలో తాతిరె డ్డిపల్లెకు చేరుకుని అక్కడ పూజా కార్యక్రమా ల్లో పాల్గొన్నారు. తిరిగి 6.30గంటల ప్రాంతం లో పులివెందులలోని ఇంటికి చేరుకున్నారు. వైసీపీ నాయకుడు మల్లికార్జునరెడ్డి, ఆయన సతీమణి ఎంపీపీ రమాదేవి, జడ్పీటీసీ పుష్ప తదితరులు పాల్గొన్నారు.



కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న వైఎస్ జగన్



పులివెందుల సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్ జగన్

విద్యలో వెనుకబాటు

సంస్కరణల పేరిట జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసం పాఠశాలలను దీనస్థితిలోకి నెట్టేసింది. చదువులను గాలికొదిలి టోఫెల్, బైజూస్, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ సిలబస్ అంటూ చేసిన ప్రయోగాలు విద్యాప్రమాణాలను దెబ్బతీశాయి. ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు అప్పగించడంతో పిల్లల చదువులు అటకెక్కాయి. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే మార్చేస్తామని ప్రగల్భాలు పలికినా.. ఆ పనులూ అసంపూర్తిగా వదిలేశారు. చాలాచోట్ల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల సదస్సులో వెల్లడించిన నివేదికలో ఈ వాస్తవాలు వెలుగుచూశాయి. ఈ నివేదిక ప్రకారం జిల్లాలోని ఒక్క పాఠశాలకు కూడా ఫైవ్‌స్టార్ రేటింగ్ దక్కకపోవడం శోచనీయమని విద్యావేత్తలు ఆందోళన చెందుతున్నారు.

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): వైసీపీ పాలనలో అనాలోచిత నిర్ణ యాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు దెబ్బతిన్నాయి. గత ఐదేళ్ల లో ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రచారంచేసుకుంది. నాడు-నేడుతో బడి స్వ రూపాన్ని మార్చేశామని గొప్పలు చెప్పుకుం ది. కాగా వాస్తవ పరిస్థితి పరిశీలిస్తే జిల్లా లోని చాలా పాఠశాలల్లో మౌలిక సదుపా యాలు లేవు. అభ్యసన ఫలితాలు బాగోలేవు. మౌలిక సదుపాయాలు, ఫలితాల్లో అత్యుత్త మంగా నిలిచిన పాఠశాల రాష్ట్రంలో ఒక్కటీ లేదు. కూటమి ప్రభుత్వం తాజాగా చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెలుగు చూ సింది. ప్రభుత్వ, ఎయిడెడ్ బడుల స్థితిగతు లను తెలుసుకునేందుకు మౌలిక సదుపా యాలు, అభ్యసన ఫలితాల (లెర్నింగ్ అవుట్ కమ్స్)కు ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను ప్రకటిం చింది. ఇటీవల కలెక్టర్ల సదస్సులో ఈ నివే దికను వెల్లడించింది. ఈ నివేదికలో జిల్లాలో ని ఒక్క పాఠశాలకు కూడా ఫైవ్‌స్టార్ రేటిం గ్ రాకపోవడం విద్యాప్రమాణాలు దెబ్బతి న్నాయనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.

నాలుగు వాటికి మాత్రమే ఫోర్‌స్టార్..

జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశా లలు 2042 ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కటి కూడా కనీసం ఒక్క విభాగంలోను ఫైవ్‌స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. రెండు పాఠశాలల్లోనైతే సున్నా ఫలితాలు వచ్చాయి. అలాగే వన్ స్టార్ 500పాఠశాలలు, టూ స్టార్ 1192, 3 స్టార్ 344పాఠశాలలు సాధిం చగా ఈ విభాగంలో నాలుగు పాఠశాలలకు మాత్రమే 4 స్టార్స్ లభించాయి. అత్యధిక పాఠశాలలు ఒకటి, రెండు, మూడు స్టార్లతో నే సరిపెట్టుకున్నాయి. మరోవైపు సదుపా యాల్లో వన్ స్టార్ 33, టూ స్టార్స్ 854, త్రీ స్టార్స్ 966, ఫోర్‌స్టార్ 169 పాఠశాలలు సాధించాయి. ఫైవ్‌స్టార్‌లో ఒక్క పాఠశాల కూడా నమోదు కాకపోవడం దౌర్భాగ్యం. ఈ నివేదికతో వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రచారం అంతా ఉత్తిదేనని తేలిపోయింది.

18 అంశాల ప్రామాణికంగా..

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల విభాగం లో రేటింగ్ కోసం 18 అంశాలను ప్రామాణి కంగా తీసుకున్నారు. బడిలో మరుగుదొడ్లు, ల్యాబులు, క్రీడామైదానం, ప్రహరీ, గ్రంథాల యం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, తరగతి గదులు, తాగునీరు తదితరాలను పరిశీలిం చారు. ఒక్కో అంశానికి 5 చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు. వీటిలో 90శాతం గ్రేడింగ్ సాధిం చిన బడులకు 5స్టార్లు కేటాయించారు. 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్ ఇచ్చారు. అ భ్యసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయు లు, విద్యార్థుల హాజరు, గతేడాది పదోతరగ తి పరీక్షల ఫలితాలు, ఇటీవల జరిగిన సమ్మె టివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను ప్రా మాణికంగా తీసుకున్నారు. ఈ నాలుగు వి భాగాల్లో హాజరుకు 40శాతం, ఫలితాలకు 60శాతం గ్రేడింగ్ ఇచ్చారు. ఈ రెండూ కలి పి 90శాతం దాటిన బడులకు ఫైవ్‌స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితా లున్న బడులకు 1నుంచి 4స్టార్లు కేటాయించారు.

ఫలితాల్లేని సదుపాయాలెందుకు?

వైసీపీ ప్రభుత్వం బడులను రాజకీయ ప్రచా రానికి వాడుకుంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను గాలికి వదిలేసింది. నాడు-నేడు పేరుతో బడులకు రంగులు, కుర్చీలు, బెంచీలు అంటూ బోధనను నిర్ల క్ష్యం చేసింది. టీచర్లకు నాడు-నేడు పనులు, మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతలు అప్పగించి బోధన సమయాన్ని తగ్గించింది. దీనిపై అప్పట్లో ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టారు. కానీ జగన్ ప్రభుత్వం వారి ఆందోళనలను పెడచెవిన పెట్టింది. పాఠశాల విద్య అంటే నాడు-నేడు పథకం ఒక్కటే అన్నట్లుగా మార్చేసి ఫలితాలను దిగజార్చిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. మరి జిల్లాలో ఇంత అధ్వాన్నంగా ఉన్న పాఠశాల విద్యను కూటమి ప్రభుత్వం ఏ మేరకు గాడిలో పెడుతుందో వేచి చూడాల్సి ఉంది.

- వైసీపీ పాలనలో దెబ్బతిన్న విద్యా ప్రమాణాలు
- ప్రభుత్వ పాఠశాలలకు దక్కని ఫైవ్‌స్టార్ రేటింగ్
- రెండు పాఠశాలలకు సున్నా ఫలితం



కబేళాలకు తరలుతున్న ఎద్దులు స్వాధీనం

● రెండు లారీలలో 64.. ● అక్రమ తరలింపుపై కేసు నమోదు

బి.కొత్తకోట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కబేళాలకు రెండు లారీల్లో తరలిస్తున్న ఎద్దుల ను పోలీసులు పట్టుకుని వాటికి విముక్తి క ల్పించిన సంఘటన బుధవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. హైదరాబాద్-చెన్నై జాతీయ రహదారిలోని ములకలచెరువు-మద నపల్లె మార్గంలో పశువుల తరలింపు జరుగు తున్నట్లు మంగళవారం రాత్రి పోలీసులకు స మాచారం వచ్చింది. బి.కొత్తకోట సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తన సిబ్బందితో స్థానికుల సహాయంతో మండల పరిధిలోని గోళ్లపల్లె వ ద్ద పశువులను తరలిస్తున్న ఏపీ39-డబ్ల్యు 4353, ఏపీ39 డబ్ల్యు4352 నెంబర్లు గల లారీ లను పట్టుకుని పరిశీలించగా అందులో 66 ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. స్థానిక పశువై ద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డిని పిలిపించి పశు వుల జాతి, విలువ, వయస్సు తదితర అంశా లను పరిశీలించారు. ప్రధాన నిందితుడిగా భావిస్తున్న పుంగనూరుకు చెందిన మహమ్మ ద్‌ఆరిఫ్‌ను విచారించగా తెలంగాణ రాష్ట్రం లోని మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు పశు వుల మార్కెట్‌లో ఎద్దులను కొనుగోలు చేసి పుంగనూరు సంతలో విక్రయించడం తమ వ్యాపారం అని అందులో భాగంగానే ఈ ఎ ద్దులను తరలిస్తున్నామని పోలీసులకు తెలి పారు. ఎద్దుల వ్యాపారి ఆరిఫ్, లారీలలో వ చ్చిన కూలీలు పొంతన లేని సమాధానాలు చెప్పడం, లారీలలో కుక్కిన కారణంగా గాయ పడిన పశువులను చూసి మూగజీవాల తర లింపు నిరోధక చట్టం, జీవహింస, గోవధ ని షేధం తదితర అంశాలను పరిగణలోకి తీసు కొని సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు చర్యలకు పూ నుకున్నారు. వీఆర్వో నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు పుంగనూరుకు చెందిన వ్యాపారి మ హమ్మద్‌ఆరిఫ్‌తో పాటు అబ్దుల్‌మునాఫ్, సు బ్రహ్మణ్యం, ముబారక్, యస్.అక్బర్, మహ బూబ్‌బాష, క్రిష్ణప్పలపై కేసు నమోదు చేశా రు. స్వాధీనం చేసుకున్న ఎద్దులను రాయచో టిలోని గోశాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తా మని, దర్యాప్తులో తేలిన అంశాల మేరకు నిందితులపై చర్యలుంటాయని అన్నారు.

కళాకారుడి హత్య కేసును నీరుగారుస్తున్న సీఐ

● డీఎస్పీ కృష్ణమోహన్‌కు హక్కుల నేతల ఫిర్యాదు



డీఎస్పీ కృష్ణమోహన్‌కు వివరాలు తెలియజేస్తున్న హక్కుల నేతలు

రాయచోటి టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గాలివీడు మండలం బోరెడ్డిగారిపల్లె వద్ద ఈనెల 23న జరిగిన మల్లెల వెంకట్రమణ (25) హత్యకేసును లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి నీరు గార్చే ప్రయత్నంలో ఉన్నాడని, ఈ కేసు విచారణ బాధ్యతల నుంచి ఆయనను తప్పించాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈశ్వర్, నిజనిర్ధారణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం వారు బోరెడ్డిగారిపల్లెను సందర్శించి స్థానికులను, ప్రత్యక్ష సాక్షులను, పోలీసులను విచారించిన అనంతరం రాయచోటిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కేసును సరైన పద్ధతిలో విచారణ చేయకుండా సీఐ నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇప్పటి వరకు చేసిన దర్యాప్తులోని లోపాలను డీఎస్పీ కృష్ణమోహన్‌కు వివరించినట్లు తెలియజేశారు. ఈ కేసులో రమణారెడ్డితో పాటు మరో ఇద్దరు పాల్గొన్నట్లు తెలుస్తోందన్నారు. సీఐ మాత్రం రమణారెడ్డి పేరును మాత్రమే ఎఫ్ఐఆర్‌లో చేర్చడం, విచారణలో జాప్యం చేయడం, బాధితులనే బెదిరిస్తుండడంతో ఈకేసు విచారణ సవ్యంగా జరుగుతుందనే నమ్మకం లేకుండా పోయిందన్నారు. వెంటనే సీఐ కొండారెడ్డిని విచారణ బాధ్యతల నుంచి తప్పించి మరొక అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, మారుతీశంకర్, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ మునీర్‌పై దాడి కేసు నమోదు

ప్రొద్దుటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ మునీర్ అతని సోదరుడు బషీర్‌పై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో దాడి కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. కౌన్సిలర్ మునీర్ సోదరుడు బషీర్ గ్రీన్‌ల్యాండ్‌కు చెందిన మహ్మద్ హుస్సేన్ అనే వ్యక్తికి డబ్బులు బాకీ వున్నాడు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 23న గ్రీన్‌ల్యాండ్‌లో గొడవ జరిగింది. దీంతో కౌన్సిలర్ మునీర్ తనపై దాడి చేశారని మహ్మద్ హుస్సేన్ మరో నలుగురిపై రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టాడు. ఇదిలావుండగా బుధవారం ఉదయం జిన్నారోడ్డులో తాను నిలబడివుండగా కౌన్సిలర్ మునీర్, అతని సోదరుడు బషీర్‌లు వచ్చి తనపై దాడి చేశారని మహ్మద్ హుస్సేన్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు విచారించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎల్ఐసీ ఆఫీసు వద్ద ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి 30 నుంచి 35 ఏళ్లు ఉంటాయని, రాత్రి నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించామని.. ఇతర వివరాలకు 9121100511కు ఫోను చేసి మరింత సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు.

మురుగుకాల్వలో పడి మహిళ మృతి




కడప క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మోచంపేట కాల్వ వద్ద బుధవారం ఓ మహిళకు ఫిట్స్ రావడంతో కాలువలో పడి మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమరనాథరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మోచంపేటకు చెందిన విజయకుమారి (33) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో పాటు ఫిట్స్‌తో బాధపడుతుండేది. ఆమెకు భర్త నాగేశ్వర్‌రావు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బుధవారం ఉదయం నడుచుకుంటూ వెళుతుండగా.. ఫిట్స్ రావడంతో పక్కనే ఉన్న మురుగుకాల్వలో పడి పోయింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో కాల్వలోనే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి.. మృతురాలు సోదరుడు సంజీవ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి.. తీవ్ర గాయాలు

ప్రొద్దుటూరు డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురం గ్రామ ఎస్సీ కాలనీలో బుధవారం జెష్టాది జయపాల్ అనే వ్యక్తిపై డేవిడ్, అతని కుమారులు కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం డేవిడ్ తన భార్య పిల్లలతో కలిసి వెళుతుండగా జయపాల్ అవమానకరంగా మాట్లాడాడు. కానీ అదేమి పట్టించుకోకుండా వారు తాళ్లమాపురం నుంచి ప్రొద్దుటూరు టౌన్‌కు వచ్చారు. బుధవారం ఉదయం క్రిస్మస్ సందర్భంగా ఎస్సీ కాలనీలోని స్కూలు వద్ద డేవిడ్ కుమారులు అశోక్, అకిల్ చలిమంటలు వేసుకుంటుంటే అక్కడికి జయపాల్ చేరుకొని మళ్లీ అవమానకరంగా మాట్లాడాడు. ఈ విషయం డేవిడ్‌కు చెప్పడంతో జయపాల్‌ను ఎందుకు ఇలా మాట్లాడుతున్నావని ప్రశ్నించాడు. అతను దురుసుగా మాట్లాడటంతో డేవిడ్ అతని కుమారులు కత్తితో జయపాల్‌పై దాడి చేశారు. దీంతో తీవ్ర రక్తగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. డేవిడ్ అతని కుమారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చిన్నమండెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. మండలంలోని దేవగుడిపల్లె పంచాయతీ జల్లావాండ్లపల్లెకు చెందిన అరమాటి రెడ్డెప్పరెడ్డి (70) రాయచోటిలో నివాసముంటున్నాడు. బుధవారం సాయంత్రం బాహూజీనగర్ కాలనీలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తన ద్విచక్ర వాహనంలో వస్తూ కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై రోడ్డువారి కుర్వ పల్లి సమీపంలోని పెట్రోలు బంకు వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రెడ్డెప్పరెడ్డికి భార్య సరోజమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

పశుకిసాన్ కార్డులకు ఆదరణ.. అంతంతే

● అన్నదాతలకు అవగాహన లేక...
● బ్యాంకర్ల సహకారం అందక..
● పాడిరైతులకు దక్కని ప్రయోజనం



ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికే కాదు పాడిసంపదను పోషించడానికి రైతులకు ఎక్కువగా పెట్టుబడి అవుతోంది. పశువుల కొనుగోలుతోపాటు వాటికి గడ్డి, దాణా, మందులు ఇలా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. అటు పంటల సాగుకు.. ఇటు పాడిపైన రైతులు పెట్టుబడులు పెట్టడానికి అప్పులు చేయాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో అన్నదాతకు అండగా నిలువడానికి పంటలకు రుణాలు ఇచ్చినట్లే.. పాడిరైతుల కోసం ప్రత్యేకంగా పశుకిసాన్ క్రెడిట్ (పీకేసీ)కార్డులను ప్రభుత్వం జారీ చేస్తోంది. వీటితో వడ్డీ లేకుండా స్వల్పకాలిక రుణాలు పొంది పాడిసంపదను వృద్ధి చేసుకోవడానికి వీలుంటుంది. అయితే పశుకిసాన్ క్రెడిట్ కార్డులకు ఆశించిన ఆదరణ దక్కడం లేదు. పశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం చేపడుతున్న పాడి రైతుల బహుళ ప్రయోజనార్థం పశుసంవర్ధకశాఖ అందజేస్తున్న పీకేసీ కార్డులు ప్రచార లోపంతో వారి దరి చేరడం లేదు. పీకేసీ కార్డులపై పాడి రైతులకు అవగాహన లేకపోవడం... బ్యాంకర్ల సహకారం అందించకపోవడంతో పశుసంవర్ధకశాఖ నుంచి కొద్దిమందికే ప్రయోజనం దక్కుతోంది. పీకేసీ కార్డులతో బహుళ ప్రయోజనాలు ఉన్నా అరకొరగా జారీ చేస్తుండడంతో పాడి రైతులు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

మూడేళ్లలో 15,584 కార్డులు జారీ

కడప జిల్లాలో పాడిపశువులను నమ్ముకుని జీవనోపాధి పొందే ప్రత్యక్ష, పరోక్ష రైతులు లక్షల సంఖ్యలో ఉన్నారు. జిల్లాలో 1.80 లక్షల మంది ప్రత్యక్షంగా పాడి కలిగిన రైతులు ఉన్నారు. 3.99 లక్షల గేదెలు, 44 వేల ఆవులు, ఎద్దులు, 3.80 లక్షల మేకలు, 9.20 లక్షల గొర్రెలు, 10 వేల కోళ్లు ఉన్నాయి. జిల్లాలో ఉన్న 17 ప్రాంతీయ పశువైద్యశాలలు, 78 పశువైద్యశాలలు, 224 రైతు భరోసా కేంద్రాల్లో పశుకిసాన్ క్రెడిట్ కార్డులకోసం దరఖాస్తులు అందజేయవచ్చు. అయితే పీకేసీ కార్డులు మాత్రం వందల సంఖ్యలోనే జారీ చేస్తున్నారు. గడిచిన మూడు సంవత్సరాలకు 15,584 కార్డులు మాత్రమే లబ్ధిదారులకు జారీ అయ్యాయి. దీంతో ఈ పథకంపై సర్కారు ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు.

పీకేసీ కార్డులతో ఉపయోగాలెన్నో...

● పశుకిసాన్ క్రెడిట్ కార్డులు సాధారణ క్రెడిట్ కార్డులుగా ఉపయోగించుకోవచ్చు. సకాలంలో పాడిపశువుల పోషణకు వనరులు సమకూర్చుకోవచ్చు.

● కార్డు ద్వారా రుణంగా తీసుకున్న సొమ్మును 40 రోజుల్లో తిరిగి చెల్లిస్తే ఎలాంటి వడ్డీ ఉండదు. ఆ తర్వాత చెల్లిస్తే 7 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఇందులో 3 శాతం ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది. నికరంగా రైతుపై నాలుగు శాతం వడ్డీ మాత్రమే పడుతుంది.

● పీకేసీ కార్డుల ద్వారా తీసుకున్న సొమ్మును పాల విక్రయాల ద్వారా తిరిగి చెల్లించుకోవచ్చు. మళ్లీ అవసరం ఉన్నప్పుడు వాడుకోవచ్చు. సక్రమంగా వినియోగించుకుంటే ఎలాంటి వడ్డీ లేకుండా ఆర్థిక అవసరాలు తీర్చుకోవచ్చు.



రైతులకు మొండిచెయ్యి

పీకేసీ కార్డుల విషయం చాలా మంది రైతులకు తెలియదు. వాటి ప్రయోజనాలపై సరైన అవగాహన కల్పించడం లేదు. సివిల్‌స్కోర్ లేదని, గతంలో ఇచ్చిన రుణాలు సక్రమంగా చెల్లించలేదని, రుణాలు చెల్లించే స్థోమత ఉంటుందో లేదో.. వంటి అనేక రకాల అభ్యంతరాలతో రైతులకు బ్యాంకర్లు మొండిచేయి చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పెద్ద రైతులు, అవగాహన కలిగిన రైతులు, నాయకులతో సత్సంబంధాలు కలిగిన కొంతమంది రైతులు నేరుగా బ్యాంకులకు దరఖాస్తులు పెట్టుకుని కార్డులు పొంది ప్రయోజనాలు దక్కించుకుంటున్నారు. సామాన్య రైతు అవగాహన రాహిత్యంతో లబ్ధి పొందలేకపోతున్నారు.

అందరూ దరఖాస్తు చేసుకోవచ్చు

పశుసంపద కలిగిన రైతులందరు దరఖాస్తు చేసుకోవచ్చు. పశుసంపద మెయింటెనెన్స్ కోసం బ్యాంకర్లు ఈ రుణాలను అందిస్తారు. ఇప్పటి వరకు జారీ అయిన కార్డుల సంఖ్య తక్కువే అయినప్పటికీ వీటి జారీ ప్రక్రియ నిరంతరం సాగుతుంటుంది. బ్యాంకర్లతో నిర్వహించే ప్రతి సమావేశంలో రైతులందరికి కార్డులను జారీ చేయాలని కోరుతూనే ఉన్నాం. గతంలో సహకార బ్యాంకుల్లో ఎక్కువగా కార్డులు జారీ చేసేవారు. ప్రస్తుతం స్టేట్‌బ్యాంకు, ఏపీజీబీ బ్యాంకులు కూడా ఎక్కువగా జారీ చేస్తున్నాయి.

- శారదమ్మ, జేడీ, జిల్లా పశుసంవర్ధకశాఖ

ఉర్దూ విద్యా వ్యవస్థను బలోపేతం చేయండి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమామ్ బాష, సయ్యద్ ఇక్బాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కడప వినాయకనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన రూట 35ఏళ్ల విజయోత్సవంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, టీడీపీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు జిలానీబాష మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ అంగన్వాడీలు ఎంతో అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఉర్దూ విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు కృషి చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్ట్‌మెంట్‌ను రెగ్యులర్ చేసి.. అవసరమైన అచార్యుల పోస్టులు మంజూరుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతమన్నారు. కార్యక్రమంలో రూట రాష్ట్ర నేతలు సిరాజ్, సత్తార్ ఫైజీ, అసదుల్లా, ముజీబ్ షాహి, నఖీఉల్లా, ఖలందర్ బాష, రఫీక్, కలీం, ఆచార్యులు డాక్టర్ వసీవుల్లా, డాక్టర్ షాజి యా, సయ్యద్ సలావుద్దీన్, టీడీపీ నేతలు అఫ్సర్‌ఖాన్, మన్సూర్ ఖాన్ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజా మహోత్సవాలు



గుడి ఉత్సవంలో ఈశ్వరీదేవి అమ్మవారు...
నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మ వారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు వేడుకగా నిర్వ హిస్తున్నారు. నాలుగో రోజు బుధవారం అమ్మవారు ఈశ్వరీదేవి మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి పుష్ప రథోత్సవంపై ఊరేగింపు నిర్వహించారు. ఆరాధన గురుపూజా మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కర్ణాటక, బళ్లారి ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారుల భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నారు. వీరికి మఠాధిపతి వీరకుమారస్వామి షీల్డ్ అందించి అనుగ్రహ పత్రాలు అందించారు. రాత్రి కేవీ సుదర్శనచారి భజన బృందం ఆధ్వర్యంలో జానపద గేయాలు, భజన కార్యక్రమాలు అలరించాయి. మూడురోజుల నుంచి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మఠం ఈవో జగన్మోహన్‌రెడ్డి సౌకర్యాలు కల్పించారు.

ప్రమాద బీమా రూ.1.90కోట్లు అందజేత



జర్రిపీటి రాజ కుటుంబానికి చెక్కును అందిస్తున్న దృశ్యం

వేంపల్లె, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొద్ది నెలల కిందట ప్రమాదవశాత్తు వంకలో పడి మృతి చెందిన జర్రిపీటి రాజ కుటుంబానికి రూ.1.90 కోట్లు బీమా మొత్తం మంజూరైంది. టాటాలైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో రాజ పాలసీ చేసి ఉన్నాడు. ఇతను ప్రమాదవశాత్తు మృతిచెందడంతో బీమా మంజూరు కోసం వేంపల్లె వాసి శివ ఉమేష్‌రెడ్డి సంబంధిత డాక్యుమెంట్లు సంస్థకు అందించి రూ.1.90 కోట్లు విడుదలయ్యేలా చర్యలు తీసుకున్నారు. చెక్కును టాటా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ కడప బ్రాంచ్ మేనేజర్ దుర్గాప్రసాద్, సీనియర్ లీడర్ నాగమల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరేంద్రారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో అడ్వైజర్లు భరణి, రవితేజ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

రాయచోటిటౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం అమరావతి వారు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఓపెన్ స్కూల్స్ అన్నమయ్య జిల్లా కోఆర్డినేటర్ కందూరు శ్రీనివాసరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా పరిధిలో ఓపెన్ స్కూల్స్ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందాలనుకునే అభ్యాసకులు ఈ నెల 26 నుంచి 31వ తేదీలోగా తత్కాల్ కింద రూ.600 ఫీజు చెల్లించి ప్రవేశం పొందవచ్చునన్నారు. మరిన్ని వివరాల కోసం అభ్యాసకులు సమీపంలోని ఏపీవో ఎస్ఎస్ స్టడీ సెంటర్‌లో గానీ, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో గానీ సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

రాజకీయ రారాజు వీరారెడ్డికి ఘననివాళులు



వీరారెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న
ఎల్ఎస్‌పీ చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి, ఏటి మన్యం సుధాకర్‌రెడ్డి

బద్వేలుటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతుబాంధవుడు, రాజకీయ దురందరుడు, రాజకీయరారాజు, దివంగత మంత్రి బిజివేముల వీరారెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా బుధవారం వీరారెడ్డి ఘాట్ వద్ద కూటమి అభ్యర్థి బొజ్జా రోశన్న, ప్రముఖులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రైల్వేకాంట్రాక్టర్ ఎం.సూర్యనారాయణరెడ్డి, బోవిళ్ల నందగోపాల్‌రెడ్డి, రైల్వేకాంట్రాక్టర్ శ్రీనివాసులు, ఎల్ఎస్‌పీ కమిటీ చైర్మన్ ఈగ వెంకట రమణారెడ్డి, బొమ్మన సుబ్బరాయుడు, ఈగ సుబ్బారెడ్డి, ఈగ సుమన్‌రెడ్డి, ఎస్‌బీవీఆర్ కళాశాల ఏఓ మన్యం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మణ్యం రామిరెడ్డి, ఏసియన్ కేబుల్ చైర్మన్ రాగిమాను ప్రతాప్‌కుమార్, కౌన్సిలర్ రాగిమాను రవితేజ, బోవిళ్ల విష్ణువర్దన్ రెడ్డి, మాజీ ఎంపీపీ భైసాని ప్రతాప్‌రెడ్డి, యారవ సుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, సాదనకారి రంతు, సీతా వెంకటసుబ్బయ్య, సీతా బాలాజీ, ఇమామ్ హుస్సేన్, హబీబున్నీసా, పుల్లప్ప నాయుడు, కొండారామక్రిష్టారెడ్డి, శెట్యం ప్రతాప్, వెంగల్‌రెడ్డి, మిత్తికాయల రమణ, కనుమర్లపూడి ప్రసాద్, మస్తాన్‌బాబు, షేక్ మన్సూర్, జహంగీర్‌బాషా, మద్దిరెడ్డి, వెంగళ శ్రీనివాసులరెడ్డి, చెరకూరి చెన్నరాయుడు, మాచుపల్లె లక్ష్మీదేవి, మిత్తికాయల సునీత, ఝాన్సీ క్రిష్టారెడ్డి తదితరులు ఆయన ఘాట్‌వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వైసీపీ నాయకులు కారుతో ఢీకొట్టి గాయపరిచారు

● ఎస్పీకి టీడీపీ నాయకుల ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసము ద్రంలో వైసీపీ నాయకులు వాహనాలతో వచ్చి తనను ఢీకొట్టి గాయపరచారని బుధవారం పీటీఎంకు చెందిన టీడీపీ నాయకుడు పాలగిరి రామాంజులు ఆపార్టీ నాయకులతో కలసి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం కోర్టు ఆదేశాలతో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించేందుకు వైసీపీ ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, సర్పంచ్‌లు తమ వాహ నాలలో వచ్చారన్నారు. కాగా తాను గ్రామంలో ఉన్న మంచినీటి సమస్యను మండల సమావేశంలో అధికారులకు విన్నవించేందుకు వెళుతుండగా ఎంపీడీవో కార్యాలయ సమీపంలోకి రాగానే వాహనంతో నామీదకు దొచ్చుకు వచ్చారన్నారు. దీంతో నా కాలికి గాయమై పక్కకు పడిపోవడంతో వారు వాహనాన్ని నిలిపి నాపై మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులైన మద్దిరెడ్డిపల్లెకు చెందిన పట్టా చంద్ర మోహన్‌రెడ్డి, డి.నారాయణపల్లెకు చెందిన ప్రతాప్‌రెడ్డితో పాటు పలువురు అక్కడికి చేరుకుని వారి నుంచి నన్ను కాపాడారన్నారు. నాపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

మంచాలమ్మ ఆలయంలో చోరీ

నందలూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆడపూరు గ్రామంలో ఉన్న మంచాలమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. 3 వెండి కిరీటాలు, 3 వెండి దీపాలు, ఒక శఠగోపం, 2 వెండి ప్లేట్లు అపహరించారు. ఏఎస్ఐ సుబ్బ రాయుడు మాట్లాడుతూ ఇద్దరి అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

30న దేశవ్యాప్తంగా నిరసనలు

వామపక్షాల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నేతలు

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా కోరుతూ 30న చేపట్టనున్న దేశవాప్త ఆందోళనను జయప్రదం చేయాలని సీపీఐ, సీపీఎం నేతలు పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్ర శేఖర్, సీపీఐ ఎంఎల్ రమణయ్య పిలుపు నిచ్చారు. వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకర, అప్రతిష్ఠాకర వ్యాఖ్యలు చేయడం క్షమించరానిదన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకినా, నిరసనలు వెల్లువెత్తినా అమిత్‌షా, ప్రధాని నరేంద్రమోదీ గాని ఇందుకు బాధ్యత వహించడానికి కానీ, దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు కానీ సిద్ధపడక పోవడం విచారకరమన్నారు. ఈ పరిస్థితుల్లో నిరసనలను కొనసాగించాలని లెఫ్ట్ పార్టీలు భావించాయి. 30న జాతీయ నిరసన దినాన్ని పాటించాలని వామపక్షాలు సంయుక్తంగా ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మనోహర్, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

కడప(వినాయకనగర్), డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన క్యాలెండర్‌ను బుధవారం ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. నగరాభివృద్ధే లక్ష్యంగా 2025లో ముందుకు సాగుతామని ప్రకటించారు. పార్టీలో కష్టపడిన వారికి భరోసాగా అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. టీడీపీ నేతలు ప్రశాంత్, లోకేశ్, వంశీ, కొండేడి హరిబాబు, వెంకటేశ్ నాయక్, కిరణ్, సంతోష్, ప్రమోద్, శ్యామ్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు మెంబర్ నియామకం పట్ల హర్షం

కడప(వినాయకనగర్), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీమ స్థాయిలో వక్ఫ్‌బోర్డు మెంబర్‌గా దావుద్‌బాషా నియామకం పట్ల హిందూపురం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌గని హర్షం వ్యక్తం చేశారు. స్థానిక నూర్జహాన్ ఫంక్షన్ హాలులో బుధవారం దావూద్‌బాషాను ఘనంగా సన్మానించిన ఆయన మాట్లాడుతూ విద్యావంతుడు, మతగురువు దావుద్‌బాషా నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉమా రాష్ట్ర అధ్యక్షుడు షంషుద్దీన్, న్యాయవాది అతావుర్ రెహమాన్, అబ్దుల్ ఖయూమ్, ఖాన్, బషీర్, జాబివుర్, రెహమాన్, ఆరీఫ్, అహ్మద్ పాల్గొన్నారు.

కాలయాపన కోసమే కమిటీ : తులసిరెడ్డి

వేంపల్లె, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీని అమలు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం కాలయాపన కోసమే మంత్రుల కమిటీని నియమించిందని ఏపీసీసీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. కర్ణాటకలో సిద్దరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేసిందన్నారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు రోజుల్లోపలే అమలు చేసి మాట నిలబెట్టుకుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆరు నెలలు దాటినా అతీగతీ లేదన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ నివేదిక కూడా ఇచ్చిందన్నారు. నెలకు రూ.250కోట్ల అదనపు ఖర్చు, అదనగా రెండువేల బస్సులు కావాలని, 11,500 మంది సిబ్బంది అదనంగా కావాలని ఉన్నతాధికారుల కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. ఆ నివేదికను అమలు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం మళ్లీ మంత్రుల కమిటీని నియమించిందన్నారు. ఈ ప్రక్రియ అంతా కాలయాపన కోసమే అన్నారు. కనీసం సంక్రాంతి నుంచైనా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేయాలని తులసిరెడ్డి కోరారు.

నడిరేయి నిబంధనల అమలు

పగటి సమయంలో వెలగని సిగ్నల్స్

నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీసులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. నగరంలోని ఎస్పీ బంగ్లా వద్ద, క్రిష్ణా సర్కిల్, ఐటీఐ సర్కిల్, బిల్టప్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌ను నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పటికే నగరంలోని కూడళ్లలో సిగ్నల్స్ పనిచేయడంలేదు. కాగా జాతీయ రహదారి అయిన ఐటీఐ సర్కిల్, బిల్టప్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేస్తున్నాయి. ఇంత వరకూ బాగున్నా ఐటీఐ సర్కిల్ వద్ద పూర్తి వర్షం కురుస్తున్నా పని చేస్తాయి. కానీ బిల్టప్ వద్ద నున్న సిగ్నల్స్ అర్ధరాత్రి సమయంలోనే పనిచేస్తాయి. పగటి సమయంలో ఆరంజ్ సిగ్నల్ ఒక్కటే వెలుగుతుంటోంది. అర్ధరాత్రి సమయంలో మాత్రం క్రమం తప్పకుండా సిగ్నల్స్ పనిచేస్తుంటాయి. ఈ సమయంలో రెడ్ సిగ్నల్ పడినప్పుడు ఆసమయంలో వచ్చే పలు వాహనాలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ నవ్వుకుంటూ వెళుతున్నారు. పోలీసుల పనితీరు ఇలావుండేంటి అంటూ నవ్వుతూ, పోలీసులు దీనిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

కడప క్రైం, ఆంధ్రజ్యోతి



నడిరేయి వెలుగుతున్న గ్రీన్‌సిగ్నల్ - పగటి సమయంలో వెలుగుతున్న ఆరంజ్ సిగ్నల్

క్రీస్తు సమాధానకర్త

అంతర్జాతీయ ప్రసంగీకుడు టీడీప్రసన్నకుమార్

ప్రజలకు అందుబాటులో ఉంటా

కడప ఎమ్మెల్యే మాధవి

నగరంలోని పలు చర్చిల్లో వేడుకగా క్రిస్మస్ వేడుకలు

కడప ఎడ్యుకేషన్ డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సర్వమానవాళికి సమాధానం కల్పించేందుకు ప్రభువైన ఏసుక్రీస్తు అవతరించారని అంతర్జాతీయ ప్రసంగీకుడు డాక్టర్ టీడీప్రసన్నకుమార్ వ్యాఖ్యానించారు. బుధవారం కడప నగరం రాజారెడ్డి వీధి కృపా పరిచర్యలు ప్రార్థన మందిరంలో క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభువైన క్రీస్తు లోకానికి రక్షకుడిగా అవతరించారన్నారు. మనల్నిరక్షించేందుకు, మనకు తనప్రేమను పంచేందుకు కన్య మరియ గర్భాన జన్మించారన్నారు. క్రీస్తు జననం సర్వమానవాళికి పాప విమోచనమని, శాంతి, దయ ప్రేమను సర్వమానవాళికి పంచిపెట్టారని చెప్పారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

కడప నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. క్రిస్మస్ పురస్కరించుకుని ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన వారు మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకంతో కడప నగర ప్రజలు తమను అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలు, సేవ చేసేందుకు తాము ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. నగర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే తమ బాధ్యతని స్పష్టం చేశారు. శ్రీనివాసరెడ్డి తనయుడు, కృపా పరిచర్యలు పెద్దలు పాల్గొన్నారు.

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని కృపా పరిచర్యలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేక్‌ను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, శ్రీనివాసరెడ్డి కృపా పరిచర్యల ప్రార్థనా మందిరం పాస్టర్ డాక్టర్ టీడీ.ప్రసన్నకుమార్ కేక్‌ని కట్ చేసి పంచిపెట్టారు. క్రైస్తవ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

కడప టౌన్ చర్చిలో...

కడప కల్చరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా టౌన్ చర్చిలో కడప ఎమ్మెల్యే మాధవి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి విశ్వాసులకు పంచి శుభాకాంక్షలు తెలిపారు.

కేశవరెడ్డి పాఠశాలలో

స్థానిక ప్రకృతినగర్‌లో కేశవరెడ్డి పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఫౌండర్ చైర్మన్ కేశవరెడ్డి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏజీఎం శ్రీదేవి క్రిస్మస్ పండుగ గొప్పదనాన్ని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నిక్రిష్ణ, ద్వారకనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

క్రిస్మస్ సందర్భంగా బిల్టప్ సమీప కృపాకాలనీ చర్చిలో నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేపట్టారు. న్యూనేటివ్ కృపా మినిస్ట్రీస్ పాస్టర్ మహేశ్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రవితేజ, శాంతిరాజు, రోజా విశ్వాసులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సేవా పురస్కారం

కడప విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు పి.దేవరాజ్, సత్యరాజుకు క్రిస్మస్ సేవా పురస్కారాలు అందించారు. మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు ఆధ్వర్యంలో వీరికి పురస్కారాలు అందించారు. పలువురు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్ బైబిల్ మిషన్ చర్చిలో...

కడప(వినాయకనగర్), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్ బైబిల్ మిషన్ చర్చి పాస్టర్ డాక్టర్ సీహెచ్ దేవదాసు ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ శ్యామ్‌సన్, భక్తులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అంతర్జాతీయ ప్రసంగీకుడు పాస్టర్ ప్రసన్నకుమార్, ఎమ్మెల్యే మాధవి, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

చెన్నూరు మండలంలో...

చెన్నూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంచి మార్గంలో నడుస్తూ పేదల పట్ల దయ, ప్రేమ చూపుతూ లోకరక్షకుడి కృపకు పాత్రులు కావాలని చెన్నూరు ఆర్సీఎం చర్చి ఫాదర్ విజయరావు అన్నారు. ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి ఏసు జీవన విధానం, ఆయన శిలువ మోసే సమయంలోనూ శిక్షింపబడే సమయంలో తన దేహాన్ని ప్రపంచం కోసమే అంకితం చేశారన్నారు.



సీఎస్ఐ చర్చిలో విశ్వాసులకు క్రీస్తు బోధనలువివరిస్తున్న పాస్టర్

పలువురు ప్రజలు పాల్గొన్నారు. మండల వ్యాప్తం గా అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

కమలాపురం మండలంలో...

కమలాపురం రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రీస్తు జయంతి సందర్భంగా స్థానిక చర్చిలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆర్సీఎం చర్చిలో ఫాదర్ రాజేశ్ దివ్యబలిపూజ సమర్పించగా సీఎస్ఐ చర్చిలో పాస్టర్ శ్యామ్యుల్, ఇతర చర్చి పాస్టర్లు ఆరాధన నిర్వహించారు. రాత్రికి సీఎస్ఐ చర్చిలో నాటకం ఆకట్టుకుంది. ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు గన్నెపాటి మల్లేశ్ చదిపిరాళ్ల చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. బాబు కులగుర శ్రీనివాసులు, బాబురావు, సుధాకర్, చిన్నయ్య, ప్రభాకర్, మనోహర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె మండలంలో...

సికెదిన్నె, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా చేసుకున్నారు. ఆయా చర్చి పాస్టర్లు యేసుక్రీస్తు జన్మ వృత్తాం తెలిపి ఆయన నడిచిన మార్గంలో నడవాలని బోధించారు. కార్యక్రమంలో ఆయా చర్చిల పాస్టర్లు, క్రిస్టియన్లు పాల్గొన్నారు.

లింగాల మండలంలో...

లింగాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు జన్మదిన వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా పార్నపల్లె, పెద్దకుడాల, లింగాల తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వ హించారు. లింగాల అఖిల భారత బేతేలు ప్రార్థన మందిరంలో హైద రాబాద్ నుంచి వచ్చిన పాస్టర్ క్రిష్టఫర్ క్రీస్తు బోధనలు మానవులు అనుసరించాల్సిన మార్గాలను ఉపదేశించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



శిల్పారామంలో నృత్యం చేస్తున్న నాగార్జున విద్యార్థులు

పులివెందుల రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక శిల్పారామం, ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని పులివెందులలోని ఎక్సలెంట్ నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు శిల్పారామంలో, మనపల్లెకు చెందిన సూర్యడ్యాన్స్ అకాడమీ బృందం ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఈ ప్రదర్శనలు చేశారు. శాస్త్రీయ, సినిమా పాటలకు వేసిన స్టెప్పులకు సందర్శకులు చప్పట్లు, ఈలలతో ప్రోత్సహించారు. పెద్దఎత్తున సందర్శకులు చేరుకుని నృత్య ప్రదర్శనలను తిలకించారు.

శత వార్షికోత్సవాలు జయప్రదం చేయండి : సీపీఐ



కడపసెవెన్ రోడ్స్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భవించి 99ఏళ్లు పూర్తిచేసుకుని నేటికి వందేళ్లలోకి అడుగిడిన సందర్భంగా డిసెంబరు 26నుంచి జరిగే శత వార్షికోత్సవాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ పిలుపునిచ్చారు. 1925, డిసెంబరు 26 ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఆవిర్భవించిన సీపీఐ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపు నిచ్చిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. 26న వాడవాడలా సీపీఐ జెండాలు ఆవిష్కరిస్తున్నట్లు, 28న కడప నగరంలో సీపీఐ శత వార్షికోత్సవ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య తదితరులు హాజరవుతున్నారన్నారు.

గొప్ప పరిపాలనాదక్షుడు వాజ్‌పేయీ

వేంపల్లె, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ప్రధాని వాజ్‌పేయీ గొప్పపరిపాలనా దక్షుడని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. బుధవారం వాజ్‌పేయీ శతజయంత్యుత్సవాలను బీజేపీ నేతలు వేంప ల్లెలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్న సమయంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఇటు కటక్ వరకు స్వర్ణచతుర్భుజి ఆకారంలో అతిపెద్ద జాతీయ రహదారులు నిర్మించారన్నారు. గ్రామీణ ప్రాంతాలకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా రహదారులు నిర్మించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో...

సింహాద్రిపురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయీ జయంతి వేడుకలను సింహాద్రిపురంలో బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నివాళులర్పించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ వాజ్‌పేయి మూడు సార్లు ప్రధానిగా వున్నా సొంత ఇల్లు కూడా లేకుండా నిరాండంబర రాజకీయ జీవితాన్ని గడపడం విశేషమన్నారు. 1998లో అణుపరీక్ష సమయంలో పోక్రాన్ ప్రయోగం నిర్వహించడం, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ ఏర్పాటులో వాజ్‌పేయీ తన సత్తా చాటారన్నారు. బీజేపీ మండల ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ద్వారకనాథరెడ్డి, కిసాన్ మోర్చా అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.



వేంపల్లె, సింహాద్రిపురంలో వాజ్‌పేయీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏపీజీబీ కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలని సేవ్ పబ్లిక్‌సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం బ్యాంకు కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలని రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్, జోనల్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్బర్‌బాష, నరసింహులు, బాబ్జి, రామిరెడ్డి, రాజశేఖర్, క్రిష్ణ, రాజేష్, డాక్టర్ చక్రధర్, చంద్రశేఖర్, తవ్వా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

కలసపాడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా హృదయపేటలో సుమారు 60 కుటుంబాలకు బెడ్ షీట్లు పంపిణీ చేశారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రంతు, కొత్తపల్లి రంగారెడ్డి వారి కుటుంబ సభ్యులు కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక టీడీపీ నేతలు బాబు, బాలరాజు, వెంగయ్య పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చలేని వైసీపీ సర్కారు

వేలకోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యం ● ఐదేళ్లు పాలించినా సమ్మర్ స్టోరేజీకి పూడ్చలేని లీకేజీలు

మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్య లేకుండా చేస్తాం ● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి

పులివెందుల టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో పాడా పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా తాగునీటి సమస్యను పరిష్కరించలేక పోయారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి ఏద్దేవా చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక నగరిగుట్ట రామాలయ సమీపంలో తాగునీటి కోసం వేస్తున్న బోరుకు పూజ నిర్వహించిన ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో పులివెందుల ప్రాంతం అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజల కనీస అవసరాలైన తాగునీటి సమస్య కూడా పరిష్కరించలేక పోయారంటే ఏ మాత్రం పరిపాలన చేశారో ప్రజలకు అర్థమవుతోందన్నారు. కేవలం కమీషన్ కోసం సుందరీకరణ పనులంటూ చేసి మౌలిక వసతుల కల్పన అభివృద్ధి పనులను అటకెక్కించారన్నారు. వైసీపీ పాలనలో వేల కోట్ల రూపాయలు పాడా నిధుల కింద ఖర్చు చేసి కూడా కనీసం పులివెందుల మున్సిపాలిటీకి తాగునీరుని అందించే సమ్మర్ స్టోరేజీ వద్ద లీకేజీ పనులు కూడా పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. వారు చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి కూటమి ప్రభుత్వం రావడంతోనే తాగునీటి సమస్య వచ్చిందని బురద చల్లే ప్రయత్నం చేస్తు న్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల్లోనే లీకేజీ పనులను పూర్తి చేశామని ప్రజా సమస్యలపై ఉన్న మా ప్రభుత్వ చిత్తశుద్ది చాటామన్నారు. పట్టణంలోని నగరిగుట్ట రోటరీపురం, భాకరాపురం తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని ప్రజల నుంచి ఫిర్యాదులందడంతో సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన జనరల్ ఫండ్ కింద బోరు వేయిచారన్నారు. పట్టణంలోని ప్రజల స్థానిక కనీస అవసరాలను పూర్తి చేయడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. నాలుగు దశాబ్దాలుగా మీ కుటుంబానికి వెన్నంటి ఉన్న ఈ పులివెందుల ప్రాంతానికి మీరు ఇచ్చిన ఘనత ఇదేనా అని ప్రశ్నించారు. మా ప్రభుత్వంలో ఒకదాని తరువాత మరొకటి ప్రాధాన్యత బట్టి బోర్లు వేసుకుంటూ తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. నియోజకవర్గంలో జలసిరి కార్యక్రమాన్ని కొనసాగించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లగానే అందుకు సీఎం ఆ పథకాన్ని కొనసాగించేలా ఆదేశాలు జారీ చేయడం సంతోషకరమన్నారు. పులివెందుల ప్రాంతానికి తాగునీరు అందించేందుకు దృఢమైన సంకల్పంతో మేము ముందుకు వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో తుంగభద్ర, కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, పులివెందుల పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ నేత మహబూబ్‌బాషా, నల్లగారి భాస్కర్‌రెడ్డి, ఖాసిం వలి, సాయి నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



బోరు వేసేందుకు పూజ చేస్తున్న బీటెక్ రవి

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


రాజుపాలెం.. టంగుటూరు సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం మైదుకూరు రోడ్డులోని ఎస్‌పీజీ-1 చర్చి, గోకుల్‌నగర్‌లోని ఎస్‌పీజీ-2 చర్చి, దొరసానిపల్లెలోని ఎస్‌పీజీ-3 చర్చి, రామేశ్వరంలోని సీఎస్ఐ చర్చి, వైఎంఆర్ కాలనీలోని గోల్డెన్‌జూబ్లి చర్చి, జమ్మలమడుగు రోడ్డులోని ఆర్‌సీఎం చర్చిలతోపాటు ఇతర చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అర్ధరాత్రి నుంచి ప్రార్థనలు ప్రారంభం అయ్యాయి. బుధవారం ఉదయం ఫాస్టర్లు ప్రార్థనలు చేసి దేవుని వాక్యం వినిపించారు. గోకుల్‌నగర్‌లోని ఎస్‌పీజీ-2 చర్చిలో ఫాదర్ రెవరెండ్ కోలాటి రాజు మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, దయ, సేవ గుణాలను అలవర్చుకోవాలన్నారు. ఎ క్రిస్మస్ సందర్భంగా ప్రేమవిందు ఏర్పాటు చేశారు. రామేశ్వరంలోని సీఎస్ఐ చర్చిలో డివిజనల్ చైర్మన్ ఫాస్టర్ జాకోబ్‌ఫ్రాంక్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. సంఘ పెద్దలు, క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొని భక్తిగీతాలు ఆలపించారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ప్రార్థనలు జరిగాయి.

రాజుపాలెం..: క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని టంగుటూరు, తొండలదిన్నె, గోపాలయపల్లె, వెలవలి తదితర గ్రామాల్లో ఈపండుగ ఘనంగా జరుపుకున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జమ్మలమడుగు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణం, గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. జమ్మలమడుగు పట్టణంలోని టౌన్ చర్చి, క్యాంబెల్ వైద్యశాల చర్చి, దానవులపాడు, పెద్దదండ్లూరు, దేవగుడి, గొరిగెనూరు, ఎస్.ఉప్పలపాడు, మోరగుడి తదితర గ్రామాల్లో చర్చిలలో క్రిస్మస్ ప్రార్థనలు జరిగాయి. ఉదయం ఆరాధన ప్రార్థనల్లో భాగంగా టీసీసీ, సీఎస్ఐ సంఘాల మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎర్రగుంట్ల..: క్రిస్మస్ వేడుకలు బుధవారం ఎర్రగుంట్లలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చి,పోట్లదుర్తిలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్‌ను కట్‌చేశారు. చిలమకూరు, ఆర్టీపీపీ, వివిధ గ్రామాల్లో చర్చిలలో క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు.

కొండాపురం..: మండలంలో క్రిస్మస్ వేడుకలను బుధవారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. పలు చోట్ల చర్చిలను విద్యుత్‌దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, సాయింత్రం పలు చోట్ల ఆటల పోటీలు నిర్వహించారు.

ముద్దనూరు..: మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు.ఎల్‌ఎం కాంపౌండ్‌లోని సీఎస్ఐ, పులివెందుల రోడ్డులోని ఎస్‌పీజీ(సీఎస్ఐ),మన్నా, హోసన్న, హెబ్రోను చర్చిలలో క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండుగ సందర్భంగా ఆటలపోటీలు నిర్వహించారు.

కలసపాడు..: మండల కేంద్రమైన కలసపాడులోని సగిలేరు నది ఒడ్డున ఉన్న పరిశుద్ధ పేతురు, పరిశుద్ధ పౌలు ఎస్‌పీజీ చర్చిలో క్రిస్మస్‌పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో చర్చిలో గురువులు, విశ్వాసులు శిలువ వెంబడి గుడి చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఉపాధ్యాయుడు కారు జె.ప్రవీణ్ కుమార్, మైనార్టీ నాయకుడు షేక్ సలీం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఆనంద్‌కుమార్, రెవరెండ్ ఆశిష్ గాబ్రియేల్, సంఘ సభ్యులు, స్త్రీలమైత్రి , యూత్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: క్రిస్మస్ వేడుకలు పోరుమామిళ్ల మండలంలో ఘనంగా జరిగాయి. క్రైస్తవులు మంగళవారం రాత్రి చర్చిల్లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. బుధవారం మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న క్రైస్తవులు తమ తమ ప్రాంతాల్లోని చర్చిల్లో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. గిరినగర్ కాలనీల్లో కోలాటం ప్రదర్శన నిర్వహించారు.

బద్వేలు రూరల్..: క్రిస్మస్‌ను పురస్కరించుకొని పట్టణంలోని బ్లెసింగ్‌చర్చి, సీఎస్ఐ, ఫాతిమా, బేతెస్థ మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేకప్రార్థనలు అనంతరం ఆర్టీసీలో పనిచేసే కూలీలకు, మహిళలకు దుస్తులను పంపిణీచేశారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరులో క్రిస్మస్ వేడుకలు బుధవారం క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. మైదుకూరు పరిధిలోని కరుణగిరి,ఆర్‌సీఎం చర్చి,సీయస్ఐ చర్చిలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.స్థానిక శాంతినగర్‌లో క్రైస్తవులు సంఘ గురువు వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

బద్వేలుటౌన్..: పట్టణంలో బుధవారం పలుచర్చిల్లో క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని గుప్తానగర్‌చర్చిలో టీడీపీ యువనాయకుడు రితేష్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బ్రహ్మంగారిమఠం..: మండలంలోని రేకలకుంట పంచాయతీలోని రెండు చర్చిలలో బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు నిర్వహించుకున్నారు. ఈ మేరకు గ్రామ కమిటీ మెంబర్ల ఆహ్వానం మేరకు మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, డి.అగ్రహారం టీడీపీ నేత కానాల మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి, మేకల సుధాకర్, ఎత్తపు ఈశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కానాల మల్లికార్జునరెడ్డి రెండు చర్చిలకు రూ.20వేల చొప్పునఅందించారు. ఈ సందర్భంగా కమిటీ మెంబర్లు టీడీపీ నేతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుజ్జు రామాంజనేయులు, రాము, ఓబయ్య, విజయేంద్రరావు, కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఖాజీపేట..: మండల పరిధిలోని చర్చిల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. బుధవారం క్రిస్మస్ పండుగను పురష్కరించుకుని ఉదయం నుండే చర్చిల్లో ప్రార్థనలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యేసుక్రీస్తు జన్మదినం పురష్కరించుకుని పండుగను నిర్వహించడం సంతోషంగా ఉందని, అలాగే అందరు కలిసికట్టుగా పండుగను నిర్వహించుకుంటున్నారని ఆయన సూచించిన మార్గంలో నడుచుకోవాలని అన్నారు.

దువ్వూరు..: యేసుక్రీస్తు మానవుని రూపంలోని దేవుడు, ప్రజారక్షకుడు అని చర్చి ఫాదర్ హర్నిస్‌రాజు తెలిపారు. దువ్వూరులో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడవాలని సూచించారు.


ప్రొద్దుటూరు..ఎస్పీజీ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు


ముద్దనూరులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


కలసపాడులో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం




మైదుకూరు.. సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, బీమఠం..టీడీపీ నేతలను సన్మానించిన చర్చి కమిటీ సభ్యులు, ప్రత్యేక అలంకరణలో దువ్వూరు చర్చి

'దేవాంగుల కార్పొరేషన్ కోసం పోరాడతాం'


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దేవాంగ సంఘం నేతలు

ప్రొద్దుటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేవాంగుల సంక్షేమం కోసం దేవాంగ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పోరాటాలకు సిద్ధపడతామని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్ ఉట్టి నాగశయన తెలిపారు. బుధవారం స్థానిక వినాయక నగర్‌లోని దేవాంగ కళ్యాణ మండపంలో దేవాంగ సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను దేవాంగ సంక్షేమ సంఘం నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గిద్దలూరు ఈశ్వరయ్య, కోశాధికారి కాటం రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఉట్టి లక్ష్మీనారాయణ, శాశ్వత గౌరవ అధ్యక్షులు ఉట్టి వీరయ్య, సందు శివనారాయణ,దేవాంగ కళ్యాణ మండపం అధ్యక్షుడు రెడ్డి చంద్రశేఖర సుబ్రమణ్యం, కార్యదర్శి సుబ్బరాయుడు, కోశాధికారి వెంకటచలపతి, ఉపాధ్యక్షులు ఆదినారాయణ, మునిస్వామి పాల్గొన్నారు.

గాండ్ల తెలికుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. బుధవారం సంఘం కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణాధ్యక్షుడు గుండుమల్ల నాగయ్య, సంఘం ఉపాధ్యక్షుడు జి.సి.పుల్లయ్య, నల్లం నాగభూషణం, నల్లం శంకర్, లక్షుమయ్య, రమణ, రమణయ్య, సురేంద్ర, చంద్రశేఖర్, విజయభాస్కర్, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదవ సమాజ అన్నదాన సత్రం క్యాలెండరు ఆవిష్కరణ

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని శ్రీ యాదవ సమాజ అన్నదాన సత్రంలో యాదవ సంఘ సమావేశం నిర్వహించారు. బుధవారం జరిగిన సమావేశంలో 2025 నూతన సంవత్సరం క్యాలెండరును అధ్యక్షుడు పెరుగు క్రిష్ణయాదవ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లక్కినేని బాలరాజుయాదవ్, కోశాధికారి మేకల పెద్దన్నయాదవ్, ఏపీ రామయ్యయాదవ్ (కర్నూలు), పెరుగు వీరనారాయణయాదవ్(హైదారాబదు) మల్లేపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ చిలమలనారాయణ, యాదవసంఘం కమిటీ సభ్యులు, మెంబర్లు పాల్గొన్నారు.

ఏపీజీబీ కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలని సేవ్ పబ్లిక్‌సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆ బ్యాంకు కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలని రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు అవదానం శ్రీనివాస్, జోనల్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్బర్‌బాష, నరసింహులు, బాబ్జి, రామిరెడ్డి, రాజశేఖర్, క్రిష్ణ, రాజేష్, డాక్టర్ చక్రధర్, చంద్రశేఖర్, తవ్వా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కరెంటు చార్జీల బాదుడుపై పోరుబాట

జమ్మలమడుగు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఈనెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి కరెంటు చార్జీల బాదుడుపై పోరుబాట ఉంటుందని జమ్మలమడుగు, మైలవరం మండలాల వైసీపీ నాయకులు ముల్లా జానీ, దన్నవాడ మహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం జమ్మలమడుగులోని వైసీపీ కార్యాలయంలో కరెంటు చార్జీల బాదుడుకు సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు.వైసీపీ నాయకులు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, పోచిరెడ్డి, చిన్నముడియం విష్ణు, తానేషావలి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌కు దరఖాస్తు చేసుకోండి

ముద్దనూరు డిసెంబరు25(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఇంటి పై కప్పుల మీద సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద అందిస్తోందని ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరాజావర్మ తెలిపారు. 1కిలో వాట్ ప్లాంట్,2కిలో వాట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, మిగిలిన వారికి సబ్సిడీతో అందిస్తోందన్నారు. ఆసక్తి ఉన్న ఎస్సీ, ఎస్టీలు జనవరి10 వతేదీలోపు విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

క్రిష్ణమ్మను పరామర్శించిన విజయమ్మ

పోరుమామిళ్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ నాయకురాలు క్రిష్ణమ్మను వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తల్లి విజయమ్మ పరామర్శించారు. బుధవారం ఆమె పోరుమామిళ్లకు వచ్చి క్రిష్ణమ్మను పరామర్శించారు. కొద్దికాలంగా క్రిష్ణమ్మ అనారోగ్యంతో ఉన్న విషయాన్ని తెలుసుకుని ఆమె బుధవారం పోరుమామిళ్లకు వచ్చి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దేశాయి శారదమ్మ పాల్గొన్నారు.

శ్మశాన స్థలంలో అక్రమంగా బిల్లులు చేసుకోలేదు

రాచమల్లు, బంగారురెడ్డిపై సర్పంచ్ కొనిరెడ్డి ఫైర్


మాట్లాడుతున్న కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు , డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరులో గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి రాచమల్లును ఓడగొట్టామనే కక్షతో ఆయన, మున్సిపల్ వైస్ చైర్మెన్ బంగారురెడ్డి కొత్తపల్లె పంచాయతీలో అక్రమాలకు పాల్పడ్డానని తనపై వారిద్దరూ పనిగట్టుకుని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీలోని సుందరయ్యకాలనీ జేమ్స్‌పేట ఏరియాలో శ్మశాన స్థలం చెరువును తలపించేలావుండేదని దానిని పూడ్చడానికి 500 టిప్పర్ల మట్టి తోలామన్నారు. దాదాపు 34 లక్షలు పనిజరిగినట్లు అధికారులు రికార్డు చేశారన్నారు. అందులో 7లక్షల మేర జీఎస్టీ ఇతర కటింగ్‌లు పోతే 26 లక్షలు మాత్రమే బిల్లు అయిందన్నారు. అది తాను వైసీపీ లోవున్నప్పుడు సంవత్సరం క్రితం జరిగిందన్నారు. బిల్లులు కూడా గత ప్రభుత్వంలోనే వచ్చాయన్నారు. కానీ అందులో మూడు, నాలుగు లక్షల పనిచేసి 40 లక్షలు దిగమింగానని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. ఈ పని విషయంలో ఏ విచారణకైనా సిద్ధం అన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలరు వంగనూరు మురళీధర్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మెన్ బొగ్గుల సుబ్బారెడ్డి, పగిడాల దస్తగిరి, రిటైర్డ్ ఎస్ఐ శంకర్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మెన్ వెంకట కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : నలుగురికి గాయాలు

కలసపాడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాయపల్లె వద్ద బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. కలసపాడు నుంచి స్వగ్రామమైన సింగరాయపల్లెకు ద్విచక్రవాహనంలో వెళుతున్న రాజు అనే వ్యక్తి, ఎగువ రామాపురం నుంచి ఫారెస్టు డిపార్ట్‌మెంటులో పనిచేస్తున్న బాషా అనే వ్యక్తి ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రాజు అనే వ్యక్తి కుడి మోకాలు వద్ద విరిగింది. బాషాకు మిగతా ఇద్దరికి కూడా కొద్దిపాటి గాయాలయ్యాయి. 108 వాహనంలో చికిత్స నిమిత్తం గాయపడ్డ వ్యక్తిని తరలించారు. కలసపాడు పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

కేసీ కెనాల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి


కేసీ కెనాల్ ఎస్ఈని సన్మానిస్తున్న దృశ్యం

రాజుపాలెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేసీ కెనాల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కేసీ కెనాల్ ఎస్ఈ బొర్రా బాలచంద్రరెడ్డిని బుధవారం మైదుకూరులోని తన నివాసంలో నీటిపారుదల ప్రాజెక్టు వైస్‌చైర్మన్ గుర్విరెడ్డి, డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ధనిరెడ్డి రామచంద్రారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కేసీ కెనాల్‌కు ఇరువైపులా పనులకు పంటపొలాల్లోని కాల్వలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించి తగిన ప్రతిపాదనలు తెస్తే వాటిని ప్రభుత్వానికి పంపించి నిధులు మంజూరు అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు.

దుప్పట్లు పంపిణీ

కలసపాడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా మండలంలోని హృదయపేట గ్రామంలో సుమారు 60 కుటుంబాలకు బెడ్‌సీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రంతు, కొత్తపల్లి రంగారెడ్డి వారి కుటుంబ సభ్యులు కలిసి మొదట కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హృదయపేట గ్రామ టీడీపీ నాయకులు బాబు, బాలరాజు, వెంగయ్య పాల్గొన్నారు.

నేటి నేతలకు ఆదర్శం బిజివేముల వీరారెడ్డి



వీరారెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీశ్‌కుమార్‌రెడ్డి తదితరులు,

బద్వేలుటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డి నేటి రాజకీయనేతలకు బిజివేముల వీరారెడ్డి ఆదర్శమని దేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బిజివేముల వీరారెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక నాలుగురోడ్ల కూడలిలో వీరారెడ్డి కాంస్యవిగ్రహానికి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి, ప్రముఖకంటివైద్య నిపుణుడు రవికుమార్‌రెడ్డితో కలసి పూలమాలలు వేసి, అనంతరం ర్యాలీగా బిజివేముల వీరారెడ్డి కళాశాల వద్ద ఉన్న వీరారెడ్డి ఘాట్‌వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే జమ్మలమడుగు ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్ వీరారెడ్డిఘాట్ వద్ద నివాళులు అర్పించి మాట్లాడారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ యువనాయకుడు రితేష్‌రెడ్డి మాట్లాడుతూ అప్పటి సీఎం ఎన్టీఆర్‌తో రాయలసీమలోని బద్వేలు నియోజకవర్గానికి బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌కు శంఖుస్థాపన చేయించి రైతుబాంధవుడయ్యారన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, రక్తదాన శిబిరం, మెగా కంటివైద్యశిబిరం, మెడికల్‌క్యాంపు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీరారెడ్డి వర్ధంతికి తరలివెళ్లిన నాయకులు

అట్లూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలోని వీరారెడ్డి 24వ వర్ధంతికి అట్లూరు మండల టీడీపీ నాయకులు బుధవారం బద్వేలుకు తరలివెళ్లి ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు మంచూరు సూర్యనారాయణరెడ్డి, బోవెళ్ల నందగోపాల్‌రెడ్డి, నరవ శ్రీనివాసులరెడ్డి, సుధారాణి, మాజీ అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, మండల అధ్యక్షుడు పాపుదిప్పు మల్లికార్జునరెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్ సర్పంచ్‌ల ఛాంబరు ఉపాధ్యక్షులు మునిరెడ్డి, జయక్రిష్ణారెడ్డి, రాధాక్రిష్ణారెడ్డి, మీనాక్షిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, చిలిపిక్రిష్టారెడ్డి చిన్నరామసుబ్బారెడ్డి, ఎల్.రామక్రిష్ణారెడ్డి, దుంపల బ్రహ్మారెడ్డి, సాంబశివారెడ్డి, మద్దికపుల్లారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, డి.వెంకటసుబ్బయ్య, గుర్విరాజ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బిజివేముల వీరారెడ్డికి ఘననివాళి

బద్వేలు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్వర్గీయ దివంగత మంత్రి బిజివేముల వీరారెడ్డి 24వ వర్ధంతిని పురష్కరించుకుని టీడీపీ నాయకులు బీవీ సుబ్బారెడ్డి, గాజులపల్లె రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బిజివేముల శివారెడ్డి, పాలకొండ వేణుగోపాల్‌రెడ్డి, జయరామిరెడ్డి తదితరులు వీరారెడ్డిఘాట్ వద్ద పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు.